

# మరీ చి.క
## కర్లపాలెం హనుమంతరావు



# మరీ చిన్నకథలు

ఇవి చిన్న కథలుగా కాకుండా 'మరీ చిన్నకథ'లు (మరీ.చి.క) లుగా నేను భావిస్తున్నాను. ఈ మధ్య అనుకోకుండా ఒకసారి సెయింట్ లూయిస్ లో ఉన్నప్పుడు ఒక పుస్తకాల దుకాణానికి వెళ్లాను. అక్కడ Running Press ప్రచురించిన ' The World's Shortest Stories ' అనే పుస్తకం చూడటం తటస్థించింది. కేవలం 55 పదాలు మించకుండా ఒక కథానికను ప్రాథమిక స్వరూప స్వభావాలు చెదరకుండా చెప్పే విధానం నాకు కొత్తగా అనిపించింది. అందులోని మర్డర్, లవ్, హారర్, సస్పెన్సు విభాగాలకింద చెప్పబడిన వందకు మించిన కథలలో కొన్ని నాకు నచ్చాయి. వాటిని యథాతథంగా తీసుకోకుండా.. కేవలం ప్రక్రియపరంగా ప్రేరణ పొంది కొన్ని చిన్నకథలు నేనూ ప్రయత్నించాను.

ఈ కథలు పూర్తిగా నా స్వతంత్రమైన ఆలోచనలు. వేటినుంచి ప్రేరణ పొందే ప్రయత్నం చేయలేదు సరికదా.. అటువంటివి బుర్రలో జొరబడినప్పుడు ప్రయత్నపూర్వకంగా వాటిని పరిహరించే ప్రయత్నం కూడా చేసాను. నా ఈ ప్రయోగం కేవలం ఒరిజినల్ గా ఉండాలన్నదే నా ఆశ.

ఇక నేను చదివిన పుస్తకంలోని కథలకు చాలా నియమ నిబంధనలు విధించారు సంపాదకులు. కేవలం పదాలకే పరిమితం కాకుండా ఫుల్ స్టాపులు, కామాలు, సెమి కోలన్లు.. వగైరాకూడా వాటిలో చర్చకు వచ్చాయి. మరీ అంత తాడుమీద నడకలాగా కాకుండా.. ప్రాథమికంగా కథను అతి తక్కువ మాటల్లో అత్యంత శక్తివంతంగా చెప్పే ప్రయత్నంమీద మాత్రమే నేను దృష్టి ఉంచడం జరిగింది. కొన్ని కథలకు కేవలం వంద పదాలే సరిపోతే.. కొన్ని కథలకు మూడువందల పదాల వరకు అవసరమయ్యాయని గమనించాలి. ఏదేమైనా మౌలికంగా ఇది మరీ చిన్న కథ(మరీ.చి, క) గా ఉండాలన్నదే నా ప్రధాన లక్ష్యం.

ఈ మరీ.చి.క లో సైతం కథాలక్షణాలన్నీ యథావిధిగా ఉండి తీరాల్సిందే. స్థూలంగా ఒక మరగుజ్జు వృక్షం (బోన్సాయ్) అనుకోవచ్చేమో! కథ చదివిన తరువాత కుదించిన పెద్దకథగా పాఠకుడు భావిస్తే ఆ మరీ.చి.క విఫలమయినట్లే. ఒక కథ, కథానిక పూర్తిగా చదివిన తరువాత కలిగే భావోద్వేగాలకు తగ్గకుండా చెప్పగలిగిన మరీ.చి.క మాత్రమే నేను అనుకొన్న ప్రక్రియకు సరితూగేది.

ఇన్ని విషయాలు దృష్టిలో ఉంచుకొని కొన్ని మరీ.చి.క లు ప్రయత్నంచాను. ఇప్పుడు చాలా పత్రికలలో 'సూక్ష్మ కథలు.. పోస్టు కార్డు కథలు, పొట్టి కథలు, చిట్టి కథలు.. అని రకరకాల పేర్లతో చిన్నకథలు వస్తున్న మాట నిజమే కానీ.. వాటి స్వరూప స్వభావానికి మరీ.చి.క కూ తేడా ఉండాలని నా ప్రయత్నం. మరీ.చి.క ఒక సమగ్రమైన అతి చిన్న కథగా పాప్యులర్ కావాలని నా కోరిక. రావి శాస్త్రిగారు ఆంధ్రజ్యోతిలో కొంతకాలం ఒక కాలానికి మించకుండా కథ చెప్పే ప్రయత్నం చేసారు. అందులో కొన్ని నిజమైన అతి చిన్న కథలు. ఆ బాటలో మరీ నడవలేక పోయినా మరీ.చి.క దానికదే ఒక ప్రత్యేకత కలిగిన మరీ చిన్న కథగా గురింపు పొందేందుకు నా ప్రయత్నం సాగుతూనే ఉంటుంది.

\- రచయిత

# డియర్ అంతరాత్మా!

డియర్ అంతరాత్మా!

పరిస్థితి మా చెయ్యి దాటిపోవడం వల్ల నీ కీ బహిరంగ లేఖ రాయడం.

ఇన్నాళ్లూ ఎక్కడా మా స్వేఛ్చకు భంగం కలిగించకుండా నీ మానానిని నీవు మౌనంగా ఉండి మా మర్యాదను కాపాడావు. ధన్యవాదాలు. మారిన పరిస్థితుల్లో నీవూ కాస్త మారాల్సి ఉంది. మా ఆరోగ్యంపట్ల మరింత శ్రద్ధ చూపించవలసిన రోజులొచ్చాయి. లేకపోతే మేము అన్ని విధాలా అన్యాయమై పోతాం.

రోజూ నిద్ర లేవగానే పళ్లు తోముకున్నట్లే, రోజు కొక్కసారైనా స్నానం చేస్తున్నట్లే, రోజుకు రెండుసార్లైనా భోజనం చేస్తున్నట్లే, నాలిక పిడచకట్టుకున్నప్పుడు మంచినీళ్లు తాగినట్లే, బ్లాడర్ నిండినప్పుడు బాత్ రూంకి పరిగెత్తినట్లే, దేనికి బధ్ధకించినా మలబధ్ధకం లేకుండా చూసుకొన్నట్లే.. నడకా, యోగా కూడా మా జీవితంలో ఓ భాగం చేయాలని చూసిందీ మెదడు. మమ్మల్ని చాలా కట్టుదిట్టాల్లో ఉంచుతూ తన బాధ్యత అది చక్కగా నిర్వర్తించింది చక్కగా. మంచిదే.

కానీ ఒక్క మా శరీరం విషయంలోనే కాదు.. మెదడు విషయంలోనూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం తప్పని సరి. విపరీతమైన ధనదాహం, కీర్తి కండూతి, అధికారం పిచ్చి పట్టుకుంది దానికిప్పుడు. వాటికోసం ఏ అడ్డదారి తొక్కేందుకైనా జంకడం మానేసింది. మా చేత అడ్డమైన పనులూ చేయిస్తోంది.

ఈ మెదడు బరితెగించడతో అంతటా అరాచకమే. ఏ ఘడియలో మాకు ఐటీ.. ఈ.డిల నుంచి నోటీసులొస్తాయో.. ఏ క్షణంలో మా చేతులకు అరదండాలు పడతాయో.ఏ రోజు న్యాస్థానం బోలులో తలొంచుకొని నిలబడాల్సొస్తుందో.. ఏ నేరశిక్షాస్మృతి కింద ఎన్నేళ్లు చిప్పకూడు తినాల్సి వస్తుందో అని క్షణ క్షణం భయంతో గుండెలు గుబ గుబా కొట్టుకొంటున్నాయి.

అందుకే మెదడుకీ ఓ లక్ష్మణ గీత అవసరం ఎంతైనా ఉంది. ఆ గీత దాటితే మెదడులోని రక్త నాళాలు అక్కడికక్కడే చిట్లి పోయేటట్లుండాలి శిక్షలు. దానికీ కఠినాతి కఠినమైన శిక్షలేమైనా ఉండి.. నిక్కచ్చిగా అక్కడికక్కడే అమలయితే గాని.. ఇప్పుడున్న చిక్కుల్లోనుంచి మేం బైట పడలేము. అప్పుడు గాని మా దేహాలకి శాంతి భద్రతలు దొరికేట్లు లేవు. ఇప్పుడైనా నీవు ఇంక ఆ మౌనం వీడి నోరు చేసుకొంటావన్న ఆశతో

మీ జోక్యం కోసం ఆత్రంగా ఎదురు చూసే

దేహం

# పాత చెప్పు - కొత్తనీతి

కోటయ్య పరమ పిసినారి. ఆ ఇలాకాలో అతని కాపీనాన్ని గురించి కథలు కథలుగా చెప్పుకొంటారు. ఈ కథ అతని పాత చెప్పుల్ని గురించి.

ధాన్యం మంచిబేరానికి అమ్ముకొని అందరికన్నా అదృష్టవంతుడని పొగిడించుకున్నాడు ఆ సీజనులో కోటయ్య. ఆ సందర్భంగా ఆయన ఏదైనా సంతర్పణలాంటిది చేస్తారని కూడా ఊరిజనం భావించారు. కోటయ్య అంత తొందరగా పైనలు రాలుస్తాడా! నలుగురూ అతన్ని గురించి వెనక ఎగతాళిగా చెప్పుకొంటున్న విషయం విని చిన్నప్పటి స్నేహితుడు రామయ్య ఇంటికి వెళ్ళి చివాట్లు పెట్టాడు. అప్పుడే బైటికి వస్తున్న కోటయ్యనుచూసి అతను వేసుకొన్న పాత చెప్పుల్ని చూసి తిట్టిపోసాడు. సమాధానంగా నవ్వి ఊరుకొన్నాడేగానీ.. చెప్పులు కొత్తవి కొంటానన్న మాట మాత్రం కోటయ్యనోటినుంచి రానేలేదు. గుళ్ళోకెళ్ళి తిరిగి బైటకువచ్చినప్పుడు తన పాత చెప్పుల స్థానే కొత్త చెప్పులు నిగనిగలాడుతూ కనిపించాయి. తన పిసినారితనానికి విసిగి రామయ్యే కొత్త చెప్పుల జతకొని అక్కడ పెట్టాడని అనుకొని ఆ చెప్పులు చక్కా వేసుకొని ఇంటికి వచ్చేసాడు.

నిజానికి ఆ చెప్పులజత ఆ ఊరి మునసబుగారివి. ఆయనా అదే సమయానికి గుడికి వచ్చాడు. తన చెప్పుల స్థానంలో పాత చెప్పులు ఉండటం ఆగ్రహం కలిగించింది. విచారిస్తే అందరూ కోటయ్య పేరే చెప్పారు. మర్నాడు పంచాయితీకి పిలిపించి విచారిస్తే కోటయ్య పొరపాటును ఒప్పుకొన్నాడు. పరిహారంగా వెయ్యి రూపాయలు చెల్లించి పాతచెప్పులు తీసుకొని వచ్చేసాడు.

పరువు తీసిన పాత చెప్పులమీద పట్టరాని ఆగ్రహం కలిగింది కోటయ్యకు. ఆ కోపంలో ఇంటికి వస్తూ దారిలోని కాలవలో విసిరేసాడు.

కాలవలో చేపలు పట్టుకొనే బెస్తలవలకి ఆ చెప్పుల జత దొరికింది మర్నాడు. చెప్పులకు కొట్టిన మేకుల మూలకంగా వలంతా ఛిద్రం ఛిద్రం అయిపోయింది. ఆ కోపంతో వాటిని కోటయ్య ఇంటిముందే విసిరేసి పోయారు బెస్తలు.

ఆ విసురుకి ఇంట్లో ఎంతోకాలంగా అపురూపంగా చూసుకొంటున్న అద్దాలు భళ్ళున పగిలిపోయాయి.

వాటిని మార్పించేందుకు కోటయ్యరానికి క్షవరానికి ముచ్చెవరం అయింది. ఎలాగైనా పాతచెపుల పీడ వదిలించుకోవాలని ఇంటివెనకాల గొయ్యితీసి పూడ్చిపెట్టాడీసారి. కోటయ్య గొయ్యి తవ్వడం కనిపెట్టిన పక్కింటి కామయ్యకు అనుమానం కలిగింది. 'ఏదో నిధి దొరికింది కోటయ్యకు. అందుకే రహస్యంగా గొయ్యితీసి పూడ్చిపెడుతున్నాడు' అని పోలీసుతాణాలో ఫిర్యాదు చేసాడు.

పోలీసుల విచారణలో కోటయ్యదాస్తున్నది పాతచెప్పులని తేలింది. పాతచెప్పుల్ని ఎందుకంత అపురూపంగా దాస్తున్నాడో మాత్రం అంతుబట్టలేదు. కోటయ్య చెప్పిన సాకులేవీ నమ్మబుద్ధిగా లేవు. పెద్ద మొత్తం వదిలించుకొంటేగాని పోలీసుల వేదింపులనుంచీ బైటపడలేకపోయాడు కోటయ్య.

ఈ సారి ఎలాగైనా పాతచెప్పుల్ని వదిలించుకోవాలనే నిశ్చయానికి వచ్చేశాడు. ఊళ్లో ఉంటే అది కుదరడం లేదు కాబట్టి.. పక్క ఊరికి వెళ్ళి ఆ పని చేయాలని ఆలోచన. దారిలో కనిపించిన పారే నీళ్లలో దాన్ని విసిరేసి అది పూర్తిగా మునిగిందాకా అక్కడే ఉండి పీడా వదిలిందని ఊపిరి పీల్చుకొని ఇంటిదారి పట్టాడు కోటయ్య.

పాత చెప్పులతో కోటయ్య అనుబంధం అంత తొందరగా తెగేదా! చెప్పులు విసిరిన కాలవ నిజానికి ఊరికి నీటి సరఫరా చేసే కాలవ. కోటయ్య పాతచెప్పులు తూముకు అడ్డంపడి గ్రామం మొత్తానికి నీటిసరఫరా ఆగిపోయింది. విచారణలో కోటయ్య చెప్పులు బైటపడ్డాయి. యథా ప్రకారం భారీ జరిమానా తప్పలేదు కోటయ్యకు.

చివరి ప్రయత్నంగా ఆ పాత జతను దహనం చేద్దామనుకొన్నాడు కోటయ్య. చెప్పులమీద ఇంత గ్యాసునూనె పోసి నిప్పు అంటించి ఆ గబ్బువాసనకి తట్టుకోలేక ఇంటికి తిరిగి వచ్చాడు.

కోటయ్య అగ్గిపెట్టిన ఐదు నిమిషాలకే హోరున వర్షం. చెప్పులు సగమే కాలాయి. సగం కాలిని చెప్పుల్లో ఒకటి గ్రామసింహాన్ని ఆకర్షించింది. అది నోట కరుచుకొని పారిపోతూ వంతెనమీదనుంచి జారివిడివడంతో కిందనే ఊరేగింపుగా వెళుతున్న వెంకటేశ్వరస్వామి ఉత్సవవిగ్రహంమీద పడింది.

అంతటా హాహా కారాలు!

కోటయ్యకి విషయం తెలిసి ఊరుదారి పారిపోయాడు. 'మళ్లీ ఎప్పుడొస్తాడా.. తగిన సత్కారం చెయ్యాల'ని అన్ని వర్గాలు ఎదురుచూస్తున్నాయి.

మళ్లా కోటయ్య ఎప్పుడు ఊళ్లోకి వస్తాడో.. అసలు వస్తాడో రాడో ఈ కథకి సమాచారం లేదు.

ఇదేం కథా.. పిల్లకాయలకు చెప్పేది? అని ఆగ్రహం తెచ్చుకోకండి! ఇదే కథను పెద్దతలకాయలూ చెప్పుకోవచ్చు. కాకపోతే .. కాస్తంత 'కోడ్' భాషలో!

'శివయ్యం'టే మొన్నటి దాకా మన అఖండ దేశాన్ని రెండు దశాబ్దాలపాటు ఏలి పోయిన దొరలు.. పాత చెప్పులంటే.. ఆ దొరల హయాములో దర్జా ఒలకపోసిన కుంభకోణాలు!

★★★

**వచ్చే నెలలో మరికొన్ని మరీ చిన్నకథలు**

COMMENTS